'చర్ల'లో వారపు సంతలు వెలవెల

మావోయిస్టుల కోసం సరిహద్దులో పోలీసుల గాలింపు ప్రభావం

జనంలేక వెలవెలబోతున్న చర్ల సంత

చర్ల, మే 26: ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దులోని వారపు సంతలు కొంతకాలంగా వెలవెలబోతున్నాయి. వ్యవసాయ కూలీలు ఎక్కువగా నివసించే చర్ల మండలంలో ప్రతీ ఆదివారం సంత జరుగుతుంది. ఈ సంతకు మండలంలోని 72 గ్రామాలతోపాటు సరిహద్దు దండకారణ్యంలోని అనేక ఆదివాసీ గ్రామాల నుంచి ప్రజలందరూ నిత్యావసర సరుకుల కోసం వస్తుంటారు. వారితో ఈ సంత ఎప్పుడూ కళకళలాడేది. ఒక్క ఆదివారమే ఇక్కడ రూ.లక్షల వ్యాపారం జరుగుతుంది. అయితే, కొంతకాలంగా ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు దండకారణ్యంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. దీంతో ఇరువైపులా ప్రాణనష్టం జరుగుతోంది. ఈ క్రమంలో మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. చర్ల మండల సరిహద్దులో పోలీసు ఔట్‌పోస్టులు ఏర్పాటుచేశారు. సరిహద్దు అటవీ గ్రామాల నుంచి చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు ఆదివాసీల రాక తగ్గింది. మావోయిస్టుల వేటలో భాగంగా సంతల్లో పోలీసు బలగాల నిఘా పెరిగింది. అడుగడుగునా తనిఖీల ప్రభావం వారపుసంతపై పడింది. రోజువారీ ఫైనాన్స్‌లు తీసుకుని, ఇతరత్రా రుణాలు తీసుకొని చిరు వ్యాపారాలు చేసుకునే వారిపై ఈ ప్రభావం అధికంగా ఉంది.

నర్సింగ్ విద్యార్థిని మృతికి యాజమాన్యానిదే బాధ్యత

భద్రాచలం మారుతీ నర్సింగ్ కాలేజీ ఘటనపై మావోయిస్టుల లేఖ

కొత్తగూడెం క్రైం, మే 26: నర్సింగ్ విద్యార్థిని మృతికి కాలేజీ నిర్వాహకుడు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావే పూర్తి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మావోయిస్టులు ఆదివారం విడుదల చేసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. భద్రాచలంలోని మారుతీ నర్సింగ్ కాలేజీ విద్యార్థిని పగిడిపల్లి కారుణ్య మృతికి యాజమాన్యానిదే పూర్తి బాధ్యత అని ఆ లేఖలో స్పష్టం చేశారు. ఆ కాలేజీలో విద్యార్థుల బలవన్మరణాలు కొత్తేమీ కాదని అన్నారు. గతంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అమన్ అనే విద్యార్థి కూడా ఇదే విధంగా చనిపోయాడని అన్నారు. ఆ విద్యార్థి మరణానికి అనారోగ్యం కారణమని అబద్ధాలు చెప్పారని, అతడి కుటుంబ సభ్యులను బెదిరించి ఆ విషయం బయటికి రాకుండా చేశారని ఆరోపించారు. దుమ్ముగూడెం మండలానికి చెందిన జీఎన్ఎం చదువుతున్న ఒక విద్యార్థిని కాలేజీ నుంచి సెలవులకు ఇంటికి వచ్చిన మరుసటి రోజే ఆత్మహత్యకు పాల్పడిందని, ఆ విద్యార్థిని మరణానికి గల కారణాలూ ఇప్పటి వరకు బయటికి రాలేదని గుర్తుచేశారు. ఈ కాలేజీ మీద అనేక ఆరోపణలు వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. భద్రాచలం ఏజెన్సీలో తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తూ ఈ కళాశాల.. అధికారులను, ప్రభుత్వాన్ని మేనేజ్ చేస్తూ నర్సింగ్ విద్య పేరుతో వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి యాజమాన్యంపై ఇప్పటి వరకు ఎలాంటి కేసులూ లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వీటిపై న్యాయ విచారణ జరిపించి నిజాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో ఈ లేఖ విడుదలైంది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

తేదీ: 26.05.2024

మావోయిస్టు పార్టీ పేరుతో విడుదలైన లేఖ

కార్పొరేట్ సెక్యూరిటీలో ఇష్టారాజ్యం?

- ఎస్ఎస్‌వోదే హవా!
- నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

కొత్తగూడెం సింగరేణి, మే 26 : సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో సంస్థ ఆస్తులను కాపాడేందుకు ఏర్పాటు చేసిన సెక్యూరిటీ విభాగంలో ఎస్ఎస్‌వో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తనకు అనుకూలంగా ఉన్నవారినే వివిధ హోదాల్లో నియమిస్తూ నియమ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. సెక్యూరిటీ విభాగంలో ప్రత్యేకమైన పోస్టులను ఏర్పాటు చేసి ఆయా విభాగాల్లో సెక్యూరిటీ సిబ్బంది అందరూ పనిచేసే విధంగా నిబంధనలు రూపొందించారు. వాటిలో ముఖ్యంగా యాంటీకోల్ తెఫ్ట్ స్క్వాడ్(ఏపీటీఎస్ – రీజియన్ పరిధిలో విధులు నిర్వహించాలి), మొబైల్ టాస్క్ ఫోర్స్(ఎంటీఎఫ్ – ఏరియా పరిధిలో విధులు నిర్వహించాలి). ఇంటిలిజెన్స్ విభాగం(ఏరియా పరిధిలో పనిచేయాలి). ఈ మూడు విభాగాలు కూడా సింగరేణి ఆస్తులను కాపాడటంతోపాటు బొగ్గు అక్రమ రవాణాకు గురికాకుండా కాపాడాల్సి ఉంటుంది. ఈ విభాగాల్లో పనిచేసే సిబ్బంది ఒక్కొక్క బ్యాచ్ ఆరునెలలు లేదా ఏడాది మాత్రమే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఎక్కువ కాలం పనిచేస్తే అక్రమాలకు పాల్పడే వారితో వీరికి పరిచయాలు ఏర్పడి వీరు కూడా అవినీతికి పాల్పడే అవకాశాలు ఉంటాయని నిబంధన రూపొందించారు. అయితే ప్రస్తుతం కార్పొరేట్‌లో ఉన్న ఎస్ఎస్‌వో ఆ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. గతంలో రెండేళ్లపాటు పనిచేసిన వారిని జీఎం తొలగించినప్పటికీ, జీఎం ఆదేశాలను బేఖాతరు చేస్తూ నాలుగునెలలు ముగిసేసరికి ఒకరికి, ఆరు నెలలు ముగిసేసరికి మరొకరికి తిరిగి ఏపీటీఎస్‌లో బాధ్యతలు అప్పగించారు. దీంతో సింగరేణిలో పనిచేసే సెక్యూరిటీగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్అండ్‌పీసీలో పనిచేస్తున్న సెక్యూరిటీగార్డులందరూ వివిధ విభాగాల్లో పనిచేసేందుకు అవకాశం కల్పించకుండా తనకు అనుకూలంగా ఉన్నవారిని మాత్రమే నియమించడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండేళ్లపాటు ఏపీటీఎస్‌లో పనిచేసిన వారు పై అధికారులను మచ్చిక చేసుకొని అక్రమంగా బొగ్గువ్యాపారం చేసేవారని ఆరోపణలు ఉన్నాయి. నెల నెలా మామూళ్లు ఇస్తున్న కారణంగానే వారినే తిరిగి విధుల్లో తీసుకున్నారని సెక్యూరిటీ విభాగం అధికారులు చర్చించుకుంటున్నారు. డైరెక్టర్(పా) ప్రత్యేక చొరవ తీసుకొని సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న అందరికీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ఎస్అండ్‌పీసీ కార్యాలయం

నియమ నిబంధనలు ఏమీలేవు

సింగరేణి ఎస్అండ్‌పీసీ విభాగంలో యూనిఫాం ఉన్న వ్యక్తిని నేనొక్కడినే. ఏసీటీఎస్, ఎంటీఎఫ్, ఇంటిలిజెన్స్ విభాగంలో ఆరునెలల కాలం, సంవత్సరకాలం పని చేయాలనే నియమ నిబంధనలు అంటూ ఏమీలేవు. టాలెంట్ ఉన్నవారిని కొనసాగించడం వల్ల సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడేందుకు ఉపయోగపడతారనే ఉద్దేశంతోనే గతంలో పనిచేసిన వారిని మరలా తీసుకోవడం జరిగింది. ప్రస్తుతం ఏసీటీఎస్, ఎంటీఎఫ్, ఇంటిలిజెన్స్ విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. కేవలం ముగ్గురు నలుగురుతోనే ఆయా విభాగాల్లో కొనసాగిస్తున్నాం.

– జాకీర్ హుస్సేన్, ఎస్ఎస్‌వో

నిబంధనల ప్రకారమే పనిచేయిస్తున్నాం

సింగరేణి సంస్థలో ఎస్అండ్‌పీసీ విభాగంలో ఏసీటీఎస్, ఎంటీఎఫ్, ఇంటిలిజెన్స్ విభాగాల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు ఆరునెలలు తక్కువ కాకుండా, ఏడాదికి ఎక్కువ కాకుండా విధులు నిర్వహించడంతోపాటు సంస్థలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు అందరూ ఆయా విభాగాల్లో తప్పనిసరిగా పనిచేయాలనే నిబంధన ఉంది. నేను జీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఎంటీఎఫ్, పర్సనల్ సెక్యూరిటీగార్డులతోపాటు ఏసీటీఎస్, ఇంటిలిజెన్స్ వారిని మార్చడం జరిగింది. ఇదేవిధంగా అన్ని ఏరియాల్లో మార్చాలని ఆదేశాలు జారీ చేశాం.

– బీఆర్ దీక్షితులు, జీఎం సెక్యూరిటీ

'గంజాయి'పై ఉక్కుపాదం మోపుతాం

- మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- మూడు ఘటనల్లో 1,035 కేజీల గంజాయి స్వాధీనం: ఎస్పీ

బొలేరోలో తరలిస్తున్న గంజాయిని పట్టుకుంటున్న పోలీసులు

బస్సులో లగేజీ పేరుతో తలిస్తున్న గంజాయి పట్టుకున్న పోలీసులు

కొత్తగూడెం క్రైం, మే 26: గంజాయి వంటి మత్తు, మాదక ద్రవ్యాలపై తమ శాఖ ఉక్కుపాదం మోపుతోందని భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు స్పష్టం చేశారు. ఇటీవల తమ శాఖ తీసుకున్న చర్యలపై ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను నిర్మూలించడంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ఎన్ఏబీ)తో కలిసి సమన్వయంగా పనిచేస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ నిషేధిత గంజాయి అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే శనివారం భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో రెండు వాహనాల్లో తరలిస్తున్న రూ.1.65 లక్షల విలువైన 427 కేజీల గంజాయిన స్వాధీనం చేసుకున్నామన్నారు. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో గల సాయిబాబా గుడి వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా బొలెరో వ్యాన్‌లో నలుగురు వ్యక్తులు పనసకాయల మాటున తరలిస్తున్న సుమారు రూ.90 లక్షల విలువైన 359 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అదే విధంగా అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు బస్సు లగేజీ బాక్సులో తమ వస్తువుల పేరుతో తరలిస్తున్న రూ.62 లక్షల విలువైన 249 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు ఘటనల్లో రూ.2,58,48,500 విలువైన 1,035 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

బుద్ధుడు నడయాడిన పుణ్యభూమి నేలకొండపల్లి

గౌతముడి బోధనలు ప్రపంచానికి ఆదర్శం: బౌద్ధ గురువు సద్దా రాకిత

నేలకొండపల్లి బౌద్ధ స్తూపం వద్ద పూజలు చేస్తున్న బౌద్ధ గురువు సద్దా రాకిత

కూసుమంచి (నేలకొండపల్లి), మే 26: గౌతమ బుద్ధుడి బోధనలు ప్రపంచానికి ఆదర్శమని బౌద్ధ గురువు సద్దా రాకిత పేర్కొన్నారు. బుద్ధుడు నడియాడిన పుణ్యభూమి ఈ నేలకొండపల్లి అని గుర్తుచేశారు. బుద్ధ జయంతి వారోత్సవాల్లో భాగంగా నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం సమీపంలోని బౌద్ధ స్తూపం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో సద్దా రాకిత ఉపదేశం చేశారు. బుద్ధుడి ఎర్రదిబ్బ దేశానికే గర్వకారణమని, నేలకొండపల్లిలో ఉండడం గొప్ప విషయమని అన్నారు. దీనిని జాతీయస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. ఇలాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు మన చరిత్రకు ఆనవాలుగా నిలిచాయన్నారు. అందుకని వీటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్‌లోని నందికొండ బుద్ధుడి మ్యూజియం కూడా ఎంతో ప్రాచుర్యం పొందిందని వివరించారు. గ్రీన్ వే సొసైటీ అధ్యక్షుడు రవికుమార్, జానకీరాం, వెంకటేశ్, నవీన్, వినయ్, కోటి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ సెక్షన్ 139(9) ఏమిటి?

డిఫెక్టివ్ రిటర్న్ నోటీసులు వస్తే ఏం చేయాలి

ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల్లో తప్పులు జరుగుతూనే ఉంటాయి. అందుకే ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. కానీ కొందరు సమయం లేకపోవడం వల్లనో, ఇతర పనుల ఒత్తిడి కారణంగానో ఐటీఆర్‌లను పరిశీలించకుండానే దాఖలు చేస్తుంటారు. అలాంటప్పుడు దాన్ని 'డిఫెక్టివ్ రిటర్న్'గా పరిగణిస్తారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 139(9) కింద ఆదాయ పన్ను శాఖ.. సదరు ఐటీఆర్‌ను దాఖలు చేసినవారికి నోటీసులనూ పంపుతుంది.

ఈ కారణాలతో..

- అన్యెర్జర్స్, స్టేట్‌మెంట్స్, అన్ని వనరుల నుంచి ఆదాయం వంటి తప్పనిసరి కాలమ్‌లను పూరించకపోతే అసెసింగ్ ఆఫీసర్ డిఫెక్టివ్ రిటర్న్ నోటీసులను ఇచ్చేందుకు వీలున్నది.
- ఐటీఆర్‌లో టీడీఎస్, టీసీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్ లేదా సెల్ఫ్–అసెస్‌మెంట్ ట్యాక్స్‌లకు సంబంధించి చెల్లించిన పన్నుల వివరాలు లేకపోతే నోటీసులు వస్తాయి.
- టీడీఎస్–ఆదాయం సరిపోల్చలేని విధంగా ఉన్నా, బుక్‌కీపింగ్ సమస్యలున్నా, ఐటీ ఆడిట్‌కు సంబంధించి అభ్యంతరాలున్నా, ఐటీఆర్–పాన్ కార్డుల్లోని పేర్లలో తేడాలున్నా నోటీసులు తప్పవు.

డిఫెక్టివ్ రిటర్న్ నోటీసు ఎలా వస్తుంది?

మీ ఐటీఆర్‌లో ఐటీ శాఖ అధికారులు తప్పుల్ని గుర్తిస్తే.. దాన్ని డిఫెక్టివ్ రిటర్న్‌గా చూస్తారు. సమాచార లోపం, గణాంకాల పొరబాట్లు, ఇతరత్రా తప్పులున్నందుకు నోటీసులిస్తారు. వీటినే డిఫెక్టివ్ రిటర్న్ నోటీసులంటారు. సంబంధిత మదింపు సంవత్సరానికిగాను మీ పాన్ నంబర్‌నుద్దేశిస్తూ ఈ నోటీసును మీ రిజిస్టర్డ్ ఈ–మెయిల్ ఐడీకి పంపుతారు. ఐటీ శాఖ ఈ–ఫైలింగ్ పోర్టల్‌లోనూ ఇది ఉంటుంది. ఈ నోటీస్.. పాస్‌వర్డ్‌తో ఉంటుంది. మీ పాన్ నంబర్, మీరు పుట్టిన తేదీయే పాస్‌వర్డ్. ఉదాహరణకు మీ పాన్ నంబర్ MNOPQ1212C, మీరు పుట్టిన తేదీ 12/12/1990. అప్పుడు మీ పాస్‌వర్డ్ MNOPQ1212C12121990.

సమయంలోగా స్పందించాలి

డిఫెక్టివ్ రిటర్న్ నోటీసుల వల్ల ఐటీఆర్ దాఖలుదారులు తాము చేసిన తప్పులకు నష్టపోకుండా ఉండేందుకు వీలుంటుంది. అయితే సకాలంలో ఈ నోటీసులకు స్పందించకపోతే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. వాస్తవానికి నోటీసు వచ్చిన 15 రోజుల్లోగా బదులివ్వాలి. ఒకవేళ ఈలోగా పని పూర్తి కాకుంటే కాలవ్యవధిని పొడిగించాలని విజ్ఞప్తి చేసుకోవచ్చు. అప్పటికీ పూర్తికాకపోతే మీరు దాఖలు చేసిన ఐటీఆర్‌ను పరిగణనలోకి తీసుకోరు. ఫలితంగా మీకేమైనా రిఫండ్స్ రావాల్సి ఉంటే ఆగిపోతాయి. అంతేగాక ఆలస్యానికిగాను వడ్డీ, జరిమానాల్నీ ఎదుర్కోవాల్సి రావచ్చు.

వర్చువల్ క్రెడిట్ కార్డులు..

వర్చువల్ క్రెడిట్ కార్డులంటే డిజిటల్ క్రెడిట్ కార్డులు. ఇవి ఆన్‌లైన్‌లో లభిస్తాయి. వీటికి భౌతిక రూపం ఉండదు. అయినప్పటికీ సాధారణ క్రెడిట్, డెబిట్ కార్డులవలే కార్డు నంబర్, సీవీవీ, వ్యాలిడిటీ తేదీలుంటాయి. ఈ వివరాలన్నీ కూడా మీకు ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం చాలా ప్రధాన క్రెడిట్ కార్డు జారీదారులు ఈ వర్చువల్ క్రెడిట్ కార్డులను అందిస్తున్నారు. అయితే వినియోగదారులు వీటిని ఆన్‌లైన్ లావాదేవీల్లోనే వాడుకోగలరు.

ఫీచర్లు–లాభాలు

వర్చువల్ క్రెడిట్ కార్డులు వన్–టైమ్ యూసేజ్ ఆప్షన్‌తో వస్తాయి. ఒకసారి వచ్చిన కార్డు నంబర్‌తో 24 గంటల నుంచి 48 గంటల వరకు మాత్రమే లావాదేవీలు జరుపగలం. దుర్వినియోగం, దొంగతనం వంటి సమస్యలను వీటి ద్వారా కస్టమర్లు అధిగమించగలరు. ఒకవేళ ఈ కార్డు తమకు అక్కర్లేదనుకుంటే కార్డుహోల్డర్లు క్యాన్సిల్ చేసుకోవచ్చు. లేదా బ్లాక్ చేసుకోవచ్చు.

ఎలా పనిచేస్తుంది?

వర్చువల్ క్రెడిట్ కార్డు అనేది మీ దగ్గరున్న క్రెడిట్ కార్డుకు ఆన్‌లైన్ రూపం. దీనికో యూనిక్ క్రెడిట్ కార్డు నంబర్ ఉంటుంది. మీ ఒరిజినల్ క్రెడిట్ కార్డు వివరాలు తెలుపకుండానే దాని ద్వారా ఆన్‌లైన్ కొనుగోళ్లు చేపట్టవచ్చు. వన్–టైమ్ కోడ్‌తో ఇది పనిచేస్తుంది. తొలుత కార్డు నంబర్‌ను ఇన్‌పుట్ చేయాలి. ఆపై వ్యాలిడిటీని ఎంటర్ చేయాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీతో వెరిఫై చేసుకొని లావాదేవీని పూర్తిచేయవచ్చు.



మనలో చాలామంది పదవీ విరమణ తర్వాత ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు.. ముందుగానే రిటైర్మెంట్ ప్రణాళికల్ని వేస్తూంటారు. కానీ ఇందుకు ఏ మార్గాన్ని ఎంచుకోవాలో మాత్రం తెలియక సతమతమవుతూంటారు. అలాంటివారిలో ఎక్కువమంది పీపీఎఫ్, ఈపీఎఫ్, ఎన్‌పీఎస్‌ల్లో దేన్ని ఎంచుకుంటే మెరుగైన రాబడుల్ని పొందవచ్చో తెలియక ఇబ్బంది పడుతూండటం కనిపిస్తుంది. అయితే 2009లో సాధారణ ప్రజానీకానికి సైతం అందుబాటులోకి వచ్చిన పెట్టుబడి సాధనం ఎన్‌పీఎస్ ఆకర్షణీయమని చెప్పకోవచ్చు.

రిటైర్మెంట్‌కు ఏది ఉత్తమం!

నేషనల్ పెన్షన్ స్కీం

ఎన్‌పీఎస్ అనేది ఓ ప్రభుత్వ స్పాన్సర్డ్ పెన్షన్ స్కీం. పదవీ విరమణ తర్వాత ఆదాయాన్ని అందిస్తుంది. ఈక్విటీ, కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు ఇలా మనం ఎంచుకున్న పెట్టుబడి మార్గాన్నిబట్టి వివిధ స్థాయిల్లో రాబడులు పొందవచ్చు. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, 80సీసీడీ కింద పన్ను ప్రయోజనాలనూ అందుకోవచ్చు.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

పీపీఎఫ్ అనేది ప్రభుత్వ దీర్ఘకాలిక పెట్టుబడి పథకం. 15 ఏండ్ల మెచ్యూరిటీ వ్యవధితో, నిర్దిష్ట రాబడులను అందిస్తుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పీపీఎఫ్ విరాళాలకు పన్ను మినహాయింపులు వర్తిస్తాయి. ఏటా రూ.1.5 లక్షలదాకా పెట్టుబడులపై పన్ను మినహాయింపుంటుంది. ఇక ఐదేండ్లు పూర్తయితే అవసరముంటే పీపీఎఫ్ ఖాతాల నుంచి కొంత నగదునూ ఉపసంహరించుకోవచ్చు.

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఈపీఎఫ్ అనేది రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం. వేతన జీవులకు ఇది ఎంతో పరిచయమున్న పథకం. ఇందులోకి అటు ఉద్యోగి, ఇటు సంస్థ నుంచి నెలనెలా కొంత నగదు మొత్తాలు వెళ్తాయి. వీటిపై స్థిరమైన వడ్డీరేటు ఉంటుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. ఏటా రూ.2.5 లక్షల వరకు పెట్టుబడులపై పన్ను ప్రోత్సాహకాలు లభిస్తాయి. పీఎఫ్ ఖాతాల నుంచి విద్య, గృహ, వైద్య అవసరాలకు నగదును ఉపసంహరించుకోవచ్చు.

చరిత్ర ఇలా..

ఎన్‌పీఎస్‌తో పోల్చితే పీపీఎఫ్, ఈపీఎఫ్‌లకు ఏండ్ల తరబడి చరిత్ర ఉన్నది. ఎప్పట్నుంచో పీపీఎఫ్, ఈపీఎఫ్‌లు పెట్టుబడి సాధనాలుగా ఉంటున్నాయి. వాటికి సురక్షితమైన పెట్టుబడులు, స్థిరమైన రాబడుల ముద్రపడింది. ఇవి రుణ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. అయితే నేటి యువతరంలో ఎన్‌పీఎస్ పెట్టుబడులు ఎంతో ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి. కారణం ఇవి స్టాక్ మార్కెట్ రిలేటెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌గా ఉన్నాయి. దీంతో రాబడులు అధికంగా, ఆకర్షణీయంగా ఉంటున్నాయి. ఇక కేవలం 25 శాతం ఈక్విటీ కేటాయింపులతో గడిచిన 15 ఏండ్లలో పీపీఎఫ్, ఈపీఎఫ్ కన్నా ఎక్కువ మొత్తంలో ఎన్‌పీఎస్‌లో రాబడుల్ని ఇన్వెస్టర్లు అందుకున్నట్టు గణాంకాలు సైతం చెప్తున్నాయి.



ఇదీ సంగతి..

మీకు 30 ఏండ్లనుకుందాం. మరో 30 ఏండ్లకు రిటైర్మెంట్ వయసు వస్తుంది. ఈ సమయంలో మీ పదవీ విరమణ నిధి కోసం పీపీఎఫ్, ఈపీఎఫ్ కంటే ఎన్‌పీఎస్ ఉత్తమమైనదని చెప్పవచ్చు. స్టాక్ మార్కెట్లలో స్వల్పకాలిక పెట్టుబడుల కన్నా, దీర్ఘకాలిక పెట్టుబడులే లాభదాయకంగా ఉంటాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు), బాండ్ల కన్నా ఎక్కువ ప్రయోజనాన్ని పొందవచ్చు.

ఉదాహరణకు: *ఏటా లక్ష రూపాయలను మీరు పెట్టుబడిగా పెట్టారనుకుందాం. పీపీఎఫ్/ఈపీఎఫ్ (ఫిక్స్‌డ్ రిటర్న్స్)లోనైతే 7.1 శాతం, 8.15 శాతం చొప్పున వడ్డీ వస్తుంది. దాంతో 30 ఏండ్ల తర్వాత దాదాపు రూ.94 లక్షలను అదనంగా పొందవచ్చు. వార్షిక చక్రవడ్డీ లాభాన్ని అందుకోవచ్చు. ఎన్‌పీఎస్ (ఈక్విటీతో)లోనైతే సగటున 10 శాతం రిటర్న్స్‌ను అంచనా వేయవచ్చు. 30 ఏండ్ల తర్వాత గరిష్ఠంగా రూ.3.43 కోట్లను అందుకునే అవకాశాలున్నాయి. వార్షిక చక్రవృద్ధిని అధికంగా చూడవచ్చు. దీంతో రిటైర్మెంట్ కార్పస్‌కు ఎన్‌పీఎస్ లాభదాయకమైనదని భావించవచ్చు.*

వ్యత్యాసం..

పీపీఎఫ్: నిర్దిష్ట రిటర్నులుంటాయి. పన్ను ప్రయోజనాలు, స్వల్ప మొత్తాల ఉపసంహరణలకు వీలున్నది. సురక్షిత పెట్టుబడులను కోరుకునేవారికి ఇవి ఉత్తమం.

ఈపీఎఫ్: మీరు ఉద్యోగులైతే మీ జీతాల్లో నుంచే ఆటోమేటిగ్గా నగదు మొత్తాలను తీసుకోవడం జరుగుతుంది. ఇందులో పొదుపునకు గ్యారంటీడ్ రిటర్న్స్, పన్ను ప్రయోజనాలుంటాయి.

ఎన్‌పీఎస్: ఈక్విటీ ఆప్షన్ల వల్ల అధిక రిటర్న్స్‌కు వీలున్నది. మీరు ఎంచుకునే పెట్టుబడులనుబట్టి అదనపు పన్ను ప్రయోజనాలు, ఫ్లెక్సిబులిటీ ఉంటుంది. అయితే మార్కెట్ రిస్క్‌కు లోబడి పెట్టుబడులుంటాయి. రిటైర్మెంట్‌కు ముందు ఉపసంహరణ ఆప్షన్లూ పరిమితంగానే ఉంటాయి. అయినప్పటికీ ఐటీ చట్టంలోని సెక్షన్ 80 సీసీడీ (1బీ) కింద పన్ను చెల్లింపుల్లో అదనంగా రూ.50,000 వరకు క్లెయిం చేసుకునే వెసులుబాటున్నది. ఇది పీపీఎఫ్, ఈపీఎఫ్‌ల్లో లభిస్తున్న రూ.1.5 లక్షలకు అదనం. ఇక ఆటోమేటిక్ రీబ్యాలెన్సింగ్ సదుపాయం కూడా ఉన్నది.

చివరగా..

మార్కెట్ రిస్క్‌లతో ఎన్‌పీఎస్ పెట్టుబడులు ముడిపడి ఉంటాయి. కాబట్టి నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత ప్రయోజనాలను ఇన్వెస్టర్లు అందుకునే వీలున్నది.

లాభాల స్వీకరణకు అవకాశం



గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను అందుకున్నాయి. ఆటుపోట్ల నడుమ మదుపరులు పెట్టుబడులకే మొగ్గారు. దీంతో అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,404.45 పాయింట్లు ఎగబాకి 75,410.39 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 455.10 పాయింట్లు అందుకుని 22,957.10 దగ్గర నిలిచింది. ఈ క్రమంలో సూచీలు దాదాపు ఆల్‌టైమ్ హైల్లో ఉన్నందున ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణ దిశగా అడుగులు వేసేందుకు ఆస్కారమున్నది. ఇప్పటిదాకా వచ్చిన లాభాలను ఒడిసిపట్టుకునేందుకు ఈ వారం అమ్మకాలకు దిగవచ్చన్న అంచనాలు మెజారిటీ నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సరళి.. మార్కెట్ ట్రేడింగ్‌ను ఇతర అంశాల కంటే ఎక్కువగా ప్రభావితం చేయవచ్చు. ఫలితంగా కొత్తగా పెట్టుబడులు పెట్టాలనుకునే వారు వేచిచూసే ధోరణిని అవలంభించవచ్చు. అయినప్పటికీ ఆయా రంగాల షేర్లలో పెట్టుబడులకూ దిగే వీలున్నదని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 22,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,300–23,500 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

మార్కెట్ పల్స్